క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలం లాలూతండా గ్రామ పంచాయతీ బోరింగ్‌తండా హనుమాన్ గుడి ఆవరణలో నిర్వహించనున్న కొత్తగూడెం నియోజకవర్గస్థాయి సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల ప్రచార కరపత్రాలను మంగళవారం కలెక్టర్ ప్రియాంక ఆల చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ కన్వీనర్, తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో నూనావత్ గోవింద్, జర్పుల ఉపేందర్, జి.నగేశ్, సంపత్‌కుమార్, రవిప్రసాద్, బాలకృష్ణ, రాములు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: మండలంలోని సంగం గ్రామంలో నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి పాల్వంచకు చెందిన చిలుకూరి పూర్ణచందర్‌రావు.. ఆయన కుటుంబ సభ్యులు మాధవ, శ్రీకాంత్, శార్వాణి, వాసు, మంజూష రూ.1.50 లక్షలు మంగళవారం విరాళంగా అందించారు. వారంతా దివంగత చిలుకూరి సుగుణ జ్ఞాపకార్థం విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు అందించారని ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు తెలిపారు.

బాలింతకు కిట్ అందజేత



కిట్ అందజేస్తున్న డాక్టర్ తేజస్విని

జూలూరుపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వలస కూలీ సౌందర్య ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు అందించే కిట్‌ను వైద్యురాలు తేజస్విని బాలింతకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పోటు వినోద్, సీహెచ్ఓ వి.వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్త విత్తనాలు నాటాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: నర్సరీల్లో మొలకెత్తని, మొలకెత్తి చనిపోయిన వాటి స్థానాల్లో నూతన విత్తనాలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని కిన్నెరసాని, కోడిపుంజులవాగు గ్రామాల్లోని నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. వేసవికాలంలో నర్సరీల్లోని ప్రతి మొక్కను బతికించాలని, ప్రతి గ్రామంలో ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ పోరండ్ల రంగా, కార్యదర్శులు అనిల్, పాషా, క్షేత్ర సహాయకులు రమేశ్, సామ్రాజ్యం పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా, ఆరు గ్యారంటీల్లో భాగంగా మరో రెండు పథకాలకు మంగళవారం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే కోరం కనకయ్య పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చీమల నాగరత్నం, పట్టణ, మండలాల అధ్యక్షులు దానియేల్, నర్సిరెడ్డి, దేవీనాయక్, సుదర్శన్‌కోరీ, జాఫర్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాసరావు, గాలిపల్లి స్వరూప, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంత సమయం పడుతుందో..?

నత్తనడకన పంచాయతీ భవనాల నిర్మాణం

- గత ఏడాది 27 జీపీలకు భవనాలు మంజూరు
- ఇప్పటివరకు పూర్తయినవి మూడే...
- ఎనిమిది చోట్ల పూర్తికాని స్థలసేకరణ



లక్ష్మీదేవిపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం



పునాది దశలోనే ఉన్న కిన్నెరసాని జీపీ భవనం

పాల్వంచరూరల్: గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరై ఏడాది కావొస్తున్నా నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. జిల్లాలోనే అత్యధికంగా పాల్వంచ మండలంలో 36 గ్రామ పంచాయతీలున్నాయి. గతంలో ఉన్న 11 గ్రామ పంచాయతీలకు పక్కా భవనాల సౌకర్యం ఉండగా, కొత్తగా ఏర్పాటైన 27 పంచాయతీల్లో సరైన భవనాలు లేక అద్దె భవనాలు, పాఠశాలల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీంతో సమావేశాల నిర్వహణ, ఉద్యోగుల విధులకు ఇబ్బంది ఏర్పడుతుండటంతో ప్రభుత్వం భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.

ఎడతెగని జాప్యం

మండలంలోని 27 పంచాయతీలకు భవనాలు మంజూరు చేయగా, ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున రూ.4.70 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇందులో 14 జీపీల భవనాలను పంచాయతీరాజ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో, 13 భవనాలను ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో చేపట్టాల్సి ఉంది. కాగా, పీఆర్ పరిధిలోని 14 భవనాలకుగాను కొత్త సూరారం, సంగం, రంగాపురం జీపీల భవనాలు పూర్తి కాగా, ఐటీడీఏ పరిధిలో ఏ భవనం కూడా పూర్తికాలేదు.

నిర్మాణ దశలో..

బిక్కుతండా పంచాయతీ, సోములగూడెం, రేగులగూడెం, చంద్రాలగూడెం, లక్ష్మీదేవిపల్లి, మల్లారం, బంజర, ప్రభాత్‌నగర్, తవిశలగూడెం, దంతలబోరు ఎస్సీకాలనీ, లక్ష్మీదేవిపల్లి, కిన్నెరసాని జీపీల భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అయితే, కిన్నెరసాని భవనం ఇంకా పునాదుల దశలోనే ఉండగా మిగతావి స్లాబ్ దశకు చేరాయి. కాగా, కారెగట్టు, జగన్నాథపురం, పాండురంగాపురం తండా, ఇల్లెందులపాడు తండా, కోడిపుంజుల వాగు, నాగారం కాలనీ, నారాయణరావుపేట ఎస్సీకాలనీ, సత్యనారాయణపురం పంచాయతీ భవనాలకు ఇప్పటివరకు స్థలాలే ఖరారు కాకపోవడం గమనార్హం.

అద్దెభవనాల్లో ఇక్కట్లు

గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేక చాలా అద్దె భవనాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇంకొన్నిచోట్ల పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల్లో కొన్ని గదులు కేటాయించారు. ఆయా చోట్ల ఇరుకైన గదులకు తోడు తాగునీరు, మూత్రశాలల సౌకర్యం కూడా లేక పాలకవర్గం, ఉద్యోగులు అవస్థ పడుతున్నారు. పలుమార్లు జీపీల సమావేశాలను చెట్ల కింద నిర్వహించిన దాఖలాలు ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయమై పదుల సంఖ్యలో విన్నవించుకున్న సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినా భవన నిర్మాణాలు ఓ కొలిక్కి రాకపోవడంతో అసంతృప్తిగానే సర్పంచ్‌లు కుర్చీ దిగిపోయారు.

నా హయాంలో నిర్మించాలనుకున్నా



జీపీ భవనాన్ని నా హయంలో నిర్మించాలని ఆశపడి స్థలం కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దీంతో అద్దె భవనమే దిక్కయింది. కనీస సౌకర్యాలు లేని అద్దె భవనంలో పంచాయతీ కార్యాకలాపాలు నిర్వహించినా ఎవరూ పట్టించుకోలేదు.

–జగదీశ్‌కుమార్, మాజీ సర్పంచ్, పాండురంగాపురం తండా

ఇప్పటికైనా పూర్తిచేయాలి



కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు పక్కాభవనాలు చాలాకాలం కిందటే మంజూరయ్యాయి. కానీ, భవన నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించలేదు. ఇకనైనా అధికారులు స్పందించి పక్కా భవనాల నిర్మాణంలో జాప్యాన్ని విడనాడి, భవనాలను అందుబాటులోకి తేవాలి.

–భీక్షం, మాజీ సర్పంచ్,

నిర్మాణాలు త్వరలో పూర్తిచేస్తాం



మా శాఖ పరిధిలో 14 జీపీలకుగాను మూడుచోట్ల భవనాల నిర్మాణం పూర్తయింది. మరో మూడు పంచాయతీలకు స్థలం చూపలేదు. మిగతా నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. వీటి పనులు త్వరగా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

–అనిల్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ, పాల్వంచ మండలం

అంతర్గత రోడ్లకు రూ.1.32కోట్ల నిధులు

పాల్వంచరూరల్: ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో వర్షాకాలంలో గ్రామాల్లో ప్రజలు పడే ఇబ్బందులు తీరనున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 27 రోడ్ల నిర్మాణానికి రూ.1.32 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇందులో నాగారం, సోములగూడెం, సత్యనారాయణపురం, రెడ్డిగూడెం, యానంబైల్, జగన్నాథపురం, పాతసూరారంలో రెండు చొప్పున ఇంకొన్ని గ్రామాల్లో ఒక్కో రోడ్డు ఉన్నాయి. కాగా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన రహదారుల నిర్మాణాన్ని మార్చి 31 నాటికి పూర్తి చేయాలని అధికారులు గడువుగా నిర్దేశించారు. అయినా కొన్నిచోట్ల నేటికీ పనులు మొదలుకాలేదు. గతేడాది కూడా ఇలాగే రోడ్ల పనులు గడువులోగా పూర్తి చేయకపోవడంతో నిధులు వెనక్కి మళ్లగా.. పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇకనైనా అధికారులు మేల్కొని రహదారుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూడడంతో పాటు నాణ్యతను పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న మహిళా కాంగ్రెస్ నేతలు

ఇల్లెందు: సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా ఇల్లెందు వచ్చిన కలెక్టర్ ప్రియాంక ఆలను ఇల్లెందు కాంగ్రెస్ మహిళలు ఘనంగా సత్కరించారు. సింగరేణి గెస్ట్ హౌజ్‌లో ఆమెను కలిసిన వారు.. గోచికొండ శ్రీదేవి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించారు. కోరం లక్ష్మి, రాధా, తార ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ వర్కర్ల సమ్మె షురూ



టేకులపల్లి: వర్కర్లతో మాట్లాడుతున్న డీడీ, ఏటీడీఓ



ఇల్లెందురూరల్: ధర్నా చేస్తున్న హాస్టల్ వర్కర్లు

టేకులపల్లి: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పీఎంహెచ్ (ఇంటర్, డిగ్రీ వసతి గృహాలు)లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న 18 నెలల వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వర్కర్లు మంగళవారం మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్‌నబీ సమ్మె ప్రారంభించి మాట్లాడారు. క్యాటరింగ్ విధానం రద్దు చేయాలని, జీఓ నంబర్ 60 ప్రకారం రూ.15,600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడుదుల వీరన్న, వీరభద్రం, అభిమన్యు, వర్కర్లు తాటి రాంబాబు, తోలెం సుజాత, హలావత్ అనిత, తాటి భారతి, పాయం విజయభారతి, ఈసం స్వరూప, కుంజా జయ, అజ్మీర కిషన్, గడ్డం బాబూరావు, కల్తి శ్రీను పాల్గొన్నారు.

డీడీ హామీతో వారం పాటు విరామం

వర్కర్లు సమ్మె బాట పట్టడంతో వంట కష్టాలు మొదలయ్యాయి. ప్రత్యామ్నాయంగా ఇతర వర్కర్ల చేత వంటలు చేయించాలని అధికారులు వార్డెన్లకు ఆదేశాలివ్వగా.. తాము అడ్డుకుంటామని వర్కర్లు తేల్చిచెప్పారు. దీంతో ఐటీడీఏ డీడీ మణెమ్మ, ఏటీడీఓ రూపాదేవి మంగళవారం రాత్రి హుటాహుటిన టేకులపల్లికి వచ్చి వర్కర్లతో మాట్లాడారు. వర్కర్లు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా సహకరించాలని డీడీ మణెమ్మ కోరడంతో వారం పాటు సమ్మెకు విరామం ఇస్తామని, సమస్య పరిష్కారం కాకపోతే మరుసటి రోజు నుంచే సమ్మెలోకి వెళ్తామని వర్కర్లు స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందురూరల్: ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వర్కర్లు మంగళవారం సమ్మె ప్రారంభించారు. విధులకు సెలవిచ్చి హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల ఎదుట ధర్నా చేపట్టారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

ఇల్లెందు: హాస్టల్ వర్కర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులోని వైటీసీలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణలో ఏటీడీఓ రూపాదేవి, ఐటీడీఏ డీడీ మణెమ్మను విద్యార్థి సంఘాల నేతలు అడ్డుకుని ఆందోళన చేశారు. వర్కర్ల సమ్మె కారణంగా మధ్యాహ్నం వరకు విద్యార్థులకు భోజనం లేకుండా పోయిందని తెలిపారు. కార్యక్రమంలో కె.పృథ్వీ, గణేశ్, బయ్యా అభిమన్యు, నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న పాయం వెంకన్న

టేకులపల్లి: లారీ, టిప్పర్ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం కోయగూడెం ఓపెన్‌కాస్ట్ చెక్‌పోస్ట్ జంక్షన్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లు, క్లీనర్ల జీతాలు పెంచాలని నెల రోజుల కిందట అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులకు నోటీసులు ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదని, తాము సమ్మె చేస్తే యజమానులు బాధ్యులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు లకావత్ నరేశ్‌తోపాటు ధర్మపురి వీరబ్రహ్మాచారి, జర్పుల సుందర్, గుగులోత్ మదార్, బి.పంతులు, డి.నరేశ్, బి.అశోక్, ఎం.వెంకటేశ్, ఎం.రాజేశ్, బి.రాజేశ్, శంకర్, సర్వేశ్, రంజిత్ కుమార్, రాజశేఖరరెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది..



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాల్వంచ: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక నెరవేరుస్తుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు అన్నారు. మంగళవారం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల గృహజ్యోతి ఉచిత విద్యుత్ ప్రారంభించిన సందర్భంగా ఇందిరాకాలనీ వద్ద సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని, కేంద్రంలో అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అయితా గంగాధర్, మధు, భరత్, బబ్లూ, ఆది ప్రశాంత్, రాపోలు ఆనంద్, రాంబాబు, సాంబయ్య, లక్ష్మిరెడ్డి, సుజాత, అనిత, మౌనిక పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు చేయండి..



వినతిపత్రం ఇస్తున్న ప్రజాపంథా నాయకులు

జూలూరుపాడు: మండలంలోని జడలచింత గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ అన్నారు. జడలచింతలో పలువురు జ్వరాలతో బాధపడుతుండటంతో ఆ గ్రామంలో మంగళవారం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు పర్యటించారు. జ్వర బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు తేజస్వినిని కలిసి జడలచింతలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేద ప్రజల గొంతుక శ్రీరాములు

ఇల్లెందురూరల్: తన ఆట, పాటతో పేదల ప్రజల గొంతుకగా కళాకారుడు కోడి శ్రీరాములు నిలిచారని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ అన్నారు. మండలంలోని మాణిక్యారం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ కోడి శ్రీరాములు చిత్రపటానికి మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనగాం కోటేశ్వరరావు, పుట్ట ఉపేందర్, కోడి మల్లయ్య, వద్దె లింగన్న, కృష్ణ, వినయ్, వెంకటేశ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే చర్యలు



ఇటుక బట్టీలను తనిఖీ చేస్తున్న అధికారులు

కొత్తగూడెంరూరల్: అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్ ఏడీ జయసింగ్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కారుకొండ రామవరం పరిధిలోని ఇటుక బట్టీల్లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కొన్ని ఇటుక బట్టీల్లో అక్రమ నిల్వలను అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ జయసింగ్ మాట్లాడారు. ఇటుక బట్టీలకు మైనింగ్ కార్యాలయంలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన ఇటుకలను తయారు చేసి, వినియోగదారులకు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



టేకులపల్లి పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఉద్యోగులు

జూలూరుపాడు/టేకులపల్లి/పాల్వంచ: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి మొదలుకానున్నాయి. ఈ మేరకు పరీక్ష కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జూలూరుపాడు, టేకులపల్లి, పాల్వంచ మండలాల్లోని కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేయగా, అధికారులు మంగళవారం పర్యవేక్షించారు. కాగా, ఉదయం 9 గంటలకు పరీక్ష మొదలు కానుండగా ఎనిమిది గంటల నుంచే అనుమతిస్తామని తెలిపారు. నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. కాగా, జూలూరుపాడులోని పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను చీఫ్ సూపరింటెండెంట్ పద్మజ, ఎస్ఐ జీవన్‌రాజు, ఎంపీఓ తోట తులసీరామ్, పంచాయతీ కార్యదర్శి సునీత, కేజీబీవీ ఎస్ఓ పద్మజ, టేకులపల్లిలో కేంద్రాన్ని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన పరిశీలించి మాట్లాడారు.

దోపిడీ పాలనను అంతం చేయాలి



పార్టీ కండువా కప్పుతున్న నాయకులు

పాల్వంచరూరల్: సమాజంలో ప్రజా సమస్యలకు పరిష్కారం దొరకాలంటే తొలు దోపిడీ పాలనను అంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు అన్నారు. మండలంలోని పునుకుల గ్రామంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో 20 మంది తమ పార్టీలో చేరారని, ప్రస్తుతం రాజకీయాలను కొందరు తమ సొంత ప్రయోజనాల కోసం వాడుకుని, ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని తెలిపారు. రాయబారపు వెంకటేశ్వర్లు, పగిడిపల్లి సంజీవరావు, రామారావు, బొల్లం కోటయ్య, లింగయ్య, ఎలమంచి వినోద్, హనుమంతు, లింగస్వామి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి..



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: పట్టణంలో కొందరు ముఠాగా ఏర్పడ్డి భూకబ్జాలకు పాల్పడుతున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంగళవారం పాల్వంచ రెవెన్యూ పరిరక్షణ సమితి నాయకులు తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రం అందించారు. పట్టణంలోని వెంగళరావుకాలనీ, నవభారత్, కరకవాగు, వెంకటేశ్వరహిల్స్‌కాలనీ, శివనగర్ ప్రాంతాల్లో కొందరు మూఠాగా ఏర్పడి దొంగ ధ్రువపత్రాలు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కిలారు నాగేశ్వరరావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మహిపతి రామలింగం, జెడ్పీటీసీ సభ్యుడు వాసుదేవరావు, రాజుగౌడ్, చల్లగుండ్ల వీరభద్రం, కాపర్తి వెంకటాచారి పాల్గొన్నారు.

మాస్‌లైన్ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న యాకూబ్‌షావలి

ఇల్లెందు: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) విలీన మహాసభలను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకూబ్‌షావలి కోరారు. మంగళవారం ఇల్లెందులోని మున్సిపల్ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ సర్కార్ అవలంబిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాల వల్ల వినాశనం పొంచి ఉందని, దీనికి వ్యతిరేకంగా కమ్యూనిస్ట్ విప్లవ శక్తులు ఒక్కతాటి మీదకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పాయం వెంకన్న, నాయని కృష్ణ, కుమార్, బి.వెంకన్న, ఉమ, సంధ్య, వరలక్ష్మి, భారతి, భూలక్ష్మి, యు.కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

మార్చి 4 నుంచి లింగబసవేశ్వర జాతర

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం పంచాయతీ ఇప్పలతండాలో కొలువుదీరిన లింగబసవేశ్వర స్వామి జాతర వేడుకలు మార్చి 4 నుంచి ప్రారంభం అవుతాయని, వీటిని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకుడు పూనెం సురేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇప్పలతండాలో జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. 4న శివపార్వతుల కల్యాణం, 5న అగ్నిగుండం, 6న ఊరేగింపు ఉంటాయని పూజారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూనెం ఉమ, పూజారులు బాణోతు శ్రీను, జర్పుల మంగమ్మ, హటియానాయక్, వెంగళరావు, రంగీలాల్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.